నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, బుధవారం 5 జూన్ 2024 YADADRI BHUVANAGIRI

భువనగిరి కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

భువనగిరిలో కాంగ్రెస్ విజయం

- చామల కిరణ్ కుమార్‌రెడ్డి భారీ గెలుపు
- రెండో స్థానంలో బీజేపీ, మూడో స్థానంలో బీఆర్ఎస్
- అన్ని రౌండ్లలోనూ కాంగ్రెస్ ఆధిపత్యం
- పోస్టల్ బ్యాలెట్‌లో బూరకు స్వల్ప మెజార్టీ
- చామల గెలుపులో మునుగోడు, తుంగతుర్తి కీ రోల్
- ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్
- 23 రౌండ్లలో ఈవీఎంల లెక్కింపు

యాదాద్రి భువనగిరి, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్ హస్తగతమైంది. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం తిరిగి కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. రెండో స్థానంలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, మూడో స్థానంలో బీఆర్ఎస్ క్యాండిడేట్ క్యామ మల్లేశ్ నిలిచారు. అన్ని రౌండ్లలోనూ కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెక్కింపు పూర్తయ్యింది. శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రానికి మూడు కిలోమీటర్ల వరకు 144సెక్షన్ అమల్లో ఉంచారు.

8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం

భువనగిరి పార్లమెంట్ పరిధిలో జనగాం, ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలు ఉన్నాయి. ఎన్నికల బరిలో 39మంది అభ్యర్థులు నిలిచారు. గత నెల 13న ఎన్నికలు జరగ్గా, 76.78 శాతంతో 13,88,680 ఓట్లు పోలయ్యాయి. ఏడు నియోజకవర్గాల ఈవీఎంలను భువనగిరి పట్టణంలోని అరోరా కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. మంగళవారం ఉదయమే కౌంటింగ్ సిబ్బంది కేంద్రానికి చేరుకున్నారు. పాస్‌లు ఉంటేనే లోపలికి అనుమతిచ్చారు. లెక్కింపు ప్రక్రియ ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను ఓపెన్ చేశారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. ఆ తర్వాత రౌండ్ల వారీగా ఈవీఎంలను లెక్కించారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఏడు కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 23 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. కౌంటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల ద్వారా రికార్డు చేశారు. లెక్కింపు ప్రక్రియలో సుమారు సుమారు 800మంది సిబ్బంది పాల్గొన్నారు. తొలి రౌండ్ ఫలితాలు ఆలస్యంగా 9.50గంటలకు విడుదలయ్యాయి. మధ్యాహ్నం వరకు గెలుపోటములపై ఎలక్షన్ ట్రెండ్ స్పష్టత వచ్చింది.

రిటర్నింగ్ అధికారి నుంచి గెలుపు సర్టిఫికెట్ అందుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చామల భారీ విజయం..

పార్లమెంట్ పరిధిలో అన్ని కలిపి 14,01,721 ఓట్లు లెక్కించారు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి 2,22,170 మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం గా ఆయనకు 6,29,143 ఓట్లు పోలయ్యాయి. రెండో స్థానంలో నిలిచిన బూర నర్సయ్యగౌడ్‌కు 4,06,973 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు 2,56,187 ఓట్లు పోలయ్యాయి. సీపీఎం అభ్యర్థిగా బరిలో నిలిచిన జహంగీర్‌కు 28,730ఓట్లు పోలయ్యాయి. ఇక నోటాకు 4,646 ఓట్లు నమోదు కావడం విశేషం. కాగా ఎన్నికల అధికారి హనుమంతు కె. జెండగే నుంచి చామల గెలుపు పత్రాన్ని అందుకున్నారు.

మునుగోడు, తుంగతుర్తిలో లక్ష మెజార్టీ

చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపులో మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాలు కీలక పాత్ర వహించాయి. కాంగ్రెస్‌కు రెండు చోట్లా కలిపి సుమారు లక్ష ఓట్లకు పైగా మెజార్టీ వచ్చింది. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో బీజేపీ గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేసింది. భువనగిరిలో చామలకు 74,319 ఓట్లు, బూరకు 64,046, క్యామకు 32,053 ఓట్లు పోలయ్యాయి.

భువనగిరి చరిత్రలో అత్యధిక మెజార్టీ

భువనగిరి పార్లమెంట్ చరిత్రలో ఈ సారే అత్యధిక మెజార్టీ సాధించింది. చామలకు 2,22,170 ఓట్ల మెజార్టీ వచ్చింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎంపీగా కేవలం 5,119 ఓట్లతోనే సమీప అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌పై గెలుపొందారు. 2014లో బీఆర్ఎస్ నుంచి బూర నర్సయ్య గౌడ్ ప్రత్యర్థి రాజగోపాల్ రెడ్డిపై 30,494 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇక 2009లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 45,898 ఓట్ల మెజార్టీతో సీపీఎం అభ్యర్థి నోముల నర్సయ్యపై గెలిచారు.

అసెంబ్లీ వారీగా ఫలితాలు

సెగ్మెంట్	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	సీపీఎం
ఇబ్రహీంపట్నం	88,013	84,044	39,541	5,684
మునుగోడు	1,08,667	54,961	35,660	4,911
భువనగిరి	74,319	64,046	32,053	3,366
నకిరేకల్	96,914	59,231	21,377	7,381
తుంగతుర్తి	1,03,087	32,964	39,678	2,646
ఆలేరు	76,730	61,470	42,685	1,738
జనగాం	76,032	44,797	43,844	2,686
మొత్తం	6,23,762	4,01,513	2,54,838	28,412

రౌండ్ల వారీగా వచ్చిన ఓట్లు

రౌండు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	సీపీఎం	మెజారిటీ
1	29,783	19,983	15,361	3,208	9,800
2	31,203	22,708	13,619	2,741	8,495
3	31,372	23,584	13,491	1,838	3,388
4	31,833	20,044	14,042	2,891	11,789
5	29,778	20,857	13,728	2,216	8,921
6	32,147	20,256	13,177	1,755	11,891
7	31,628	23,285	13,640	1,359	8,243
8	33,527	23,343	12,713	827	10,184
9	35,035	20,554	14,631	1,231	14,481
10	31,790	22,436	13,683	1,047	9,354
11	31,708	24,666	13,094	910	7,042
12	31,512	22,292	13,380	656	9,220
13	31,967	21,875	12,952	1,009	10,092
14	34,438	20,607	13,182	1,072	13,831
15	33,619	19,827	13,141	1,085	13,792
16	32,624	17,714	12,811	1,227	14,910
17	33,803	19,110	12,512	1,009	14,693
18	26,493	15,700	9,750	672	10,793
19	16,337	8,216	4,564	390	8,121
20	12,614	6,240	4,581	516	6,374
21	9,799	4,040	3,206	302	5,759
22	9,321	3,718	3,241	357	5,603
23	1,431	339	458	49	1,092
పోస్టల్ బ్యాలెట్	5,381	5,460	1,949	318	79
మొత్తం	6,29,143	4,06,973	2,56,187	28,730	2,22,170

ఇద్దరూ కొత్తే..

ఉమ్మడి జిల్లాలో గెలిచిన ఇద్దరు ఎంపీలు కొత్తగా పార్లమెంట్‌లో అడుగుపెట్టనున్నారు. భువనగిర నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి తొలిసారి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. చామలకు పెద్దగా రాజకీయ అనుభవం, వారసత్వం కూడా లేదు. బిజినెస్ నుంచి నేరుగా రాజకీయాల్లోకి వచ్చారు. ఇక నల్లగొండ నుంచి రఘువీర్ రెడ్డి పోటీ చేసిన తొలిసారే భారీ మెజార్టీతో గెలిచారు. కాగా నల్లగొండ, భువనగిరిలో రెండు చోట్ల కాంగ్రెస్ సిట్టింగ్ స్థానాలను మరోసారి గెలుచుకుంది.

పోస్టల్‌లో నోటాకు 75 ఓట్లు

ఈవీఎంలలో చామల హవా కొనసాగగా, పోస్టల్ బ్యాలెట్‌లో మాత్రం బూర నర్సయ్య గౌడ్ స్వల్పంగా ఆధిక్యం కనబరిచారు. మొత్తం 13,142 ఓట్లు పోలయ్యాయి, బూరకు 5,460 ఓట్లు రాగా 79 ఓట్ల స్వల్ప మెజార్టీ సాధించారు. చామలకు 5,381, క్యామ మల్లేశ్‌కు 1,349 ఓట్లు పోలయ్యాయి. కాగా 75 ఓట్లు నోటాకు పోలవగా, 325 ఓట్లు రిజెక్ట్ అయ్యాయి.

భారీ బందోబస్తు..

కౌంటింగ్ సెంటర్ వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. లెక్కింపు కేంద్రానికి మూడు కిలో మీటర్ల వరకు 144 సెక్షన్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర బలగాలు విధులు నిర్వహించాయి. లెక్కింపు కేంద్రంలోకి సెల్ ఫోన్లు, వాటర్‌బాటిళ్లు, సిగరెట్లు, మద్యం తదితర వస్తువులను అనుమతించ లేదు. ఇక కౌంటింగ్ నేపథ్యంలో మద్యం దుకాణాలను బంద్ చేశారు.

నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్ మెజారిటీ..

తుంగతుర్తి	70,163
మునుగోడు	53,706
నకిరేకల్	37,683
జనగాం	31,235
ఆలేరు	15,260
భువనగిరి	10,273
ఇబ్రహీంపట్నం	3,969

బీజేపీకి చెంపపెట్టు : చామల

ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడే తీర్పును ఇచ్చారని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. మరోసారి కాంగ్రెస్ పార్టీపై ప్రజలు నమ్మకాన్ని ఉంచి భారీ మెజార్టీతో గెలిపించినందుకు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీగా గెలిచిన అనంతరం మంగళవారం భువనగిరి పట్టణంలో సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 400సీట్లు అంటూ ప్రచారం చేసిన ప్రధాని మోదీకి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. సెక్యులర్ పదాన్ని తుడిచిపెట్టేలా వ్యవహరించిన బీజేపీకి ఈ ఎన్నికలు చెంప పెట్టు అని విమర్శించారు. సర్వే సంస్థలు, సోషల్ మీడియాలో భువనగిరిలో ఓడిపోతుందని దుష్ప్రచారం చేసి.. కార్యకర్తలను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారని, అయినప్పటికీ కార్యకర్తలు ఎక్కడా మనోధైర్యాన్ని కోల్పోకుండా పనిచేశారని తెలిపారు. సర్వే పేరుతో కుంభకోణానికి పాల్పడి, సెన్సెక్స్ భారీగా పెంచి రూ.20లక్షల కోట్ల నష్టానికి బీజేపీ కారణమైందని చెప్పారు.

నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రం

పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌కు
సర్వం సిద్ధం!

- నేడు ఉదయం 8గంటల నుంచి మొదలు
- తొలుత అన్ని బ్యాలెట్ పత్రాల కట్టల కార్యక్రమం
- మధ్యాహ్నం నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ఒక్కో రౌండ్‌లో 96 వేల ఓట్ల లెక్కింపు
- నాలుగు రౌండ్లలో తేలనున్న తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్క
- చెల్లిన ఓట్లలోంచి గెలుపు కోటా నిర్ధారణ
- ఫలితం తేలకుంటే రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- 36 గంటలకు పైగానే కౌంటింగ్ సమయం
- కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్
- పకడ్బందీగా లెక్కింపు, ఏర్పాట్లు పూర్తి : ఆర్ఓ హరిచందన

నల్లగొండ ప్రతినిధి, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. నల్లగొండ పట్టణ శివారులోని ఎ.దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములలో లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు కోసం నాలుగు కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేశారు. ఒక్కో హాల్‌లో 24 టేబుళ్లపై లెక్కింపు కొనసాగుతుంది. ముందుగా బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కట్టే కార్యక్రమాన్ని చేపడుతారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇదే కొనసాగవచ్చని అంచనా. అనంతరం ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. ఒక్కో రౌండ్‌లో 96వేల ఓట్ల చొప్పున ప్రథమ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఇలా మొత్తం నాలుగు రౌండ్లలో పోలైన 3,36,005 ఓట్లను లెక్కించనున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితోపాటు మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా.. కౌంటింగ్‌కు అధికారులు పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక ఓట్ల లెక్కింపు ప్రాంతంలో 144 సెక్షన్ ఏర్పాటు చేస్తూ మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. పూర్తిగా సీసీ టీవీల పర్యవేక్షణలో నిఘా కొనసాగనుంది. మరోవైపు నేటి కౌంటింగ్ కోసం మంగళవారం సాయంత్రం నుంచే జిల్లా కేంద్రంలో సందడి మొదలైంది. అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లు, వారి కార్యకర్తలు, అభిమానుల రాకతో హోటళ్లు, లాడ్జీలన్నీ కిక్కిరిసిపోయాయి.

ముందుగా బండిల్స్ ప్రక్రియ

నాలుగు కౌంటింగ్ హాళ్లలో ఒక్కో హాల్‌లో 24 టేబుళ్ల చొప్పున మొత్తం 96 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. వీటిపై ముందుగా బ్యాలెట్ పత్రాలను కట్టలు కట్టే కార్యక్రమం చేపడుతారు. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో నిలువగా.. 605 పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులను వరుస క్రమంలో టేబుల్‌కు ఒకటి ఇచ్చి ఓపెన్ చేస్తారు. బ్యాలెట్ బాక్సుల్లోని బ్యాలెట్ పేపర్లను టేబుల్‌పై కుప్పగా పోసి 25 పేపర్లను ఒక కట్టగా చేసి బండిల్స్ చేస్తారు. పోస్టల్ బ్యాలెట్లను కూడా ఇదే సమయంలో వీటితో కలిపేస్తారు. ఎప్పటికప్పుడు వీటన్నింటినీ తీసుకెళ్లి ఓ పెద్ద డ్రమ్ములో వేస్తారు. బండిల్ కార్యక్రమం పూర్తయ్యాక లెక్కింపు మొదలు కానుంది. అయితే.. బండిల్ కట్టేందుకే కనీసం ఐదు నుంచి ఆరు గంటల సమయం పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇది కొనసాగుతుండవచ్చని అంచనా. ఆ తర్వాతే అసలు ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. తొలి ప్రాధాన్యత ఓట్లను ముందుగా లెక్కిస్తారు. లెక్కింపునకు రెండు రోజుల సమయం పట్టవచ్చని భావిస్తున్న అధికారులు షిఫ్టులుగా సిబ్బందిని నియామకం చేశారు. సమయంతో సంబంధం లేకుండా ఒక్కో ప్రక్రియ ముగిసే వరకు ఒక షిఫ్ట్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని తెలిసింది. ఇక ఇదేవిధంగా కౌంటింగ్ ఏజెంట్లకు కూడా షిఫ్ట్‌ల వారీగా పాస్‌లు జారీ చేశారు.

సాయంత్రానికి తొలి ఫలితం..

బ్యాలెట్ పేపర్లన్నింటినీ 25 చొప్పున కట్టలు కట్టడం పూర్తి చేశాక తొలి ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌కు 40 కట్టల చొప్పున మొత్తం వెయ్యి ఓట్లను ఒక రౌండ్‌లో ఇస్తారు. ఇలా ఒకేసారి 96 టేబుళ్లపై 96వేల ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. ఇలా చేపట్టే తొలి రౌండ్ ఫలితం నేటి సాయంత్రం 5గంటల వరకు వెలువడవచ్చని అంచనా. బండిల్స్ కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటలకు ముగిస్తే గంట విరామం అనంతరం మూడు గంటలకు తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలైతే గంటన్నర నుంచి రెండు గంటల్లో తొలి రౌండ్ ఫలితం వెలువడవచ్చని అంచనా. ఇలా అనుకున్నది అనుకున్నట్లు జరిగితే అర్ధరాత్రి 12గంటల వరకు తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి కావచ్చని భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,36,005 ఓట్లు పోలైన విషయం తెలిసిందే. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సమయంలోనే చెల్లని ఓట్లను వేరు చేస్తారు. ఆ తర్వాత చెల్లిన ఓట్ల నుంచే గెలుపు కోటాను నిర్ధారిస్తారు. చెల్లిన ఓట్లలో 50శాతం+1ను గెలుపు కోటా కానుంది. తొలి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికీ గెలుపు కోటా రాకపోతే అప్పుడు ఎలిమినేషన్ ప్రక్రియ మొదలవుతుంది. ఇదే జరిగితే తర్వాత కూడా కౌంటింగ్ కొనసాగనుంది.

ఎలిమినేషన్‌కు మరింత సమయం

తొలి ప్రాధాన్యత ఓట్లు పూర్తయ్యే సరికి అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లపై, అదేవిధంగా గెలుపు కోటాపై స్పష్టత వస్తుంది. అప్పటికీ ఎవరూ గెలుపు కోటా ఓట్లు సాధించలేకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను మొదలు పెడుతారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ రౌండ్‌ను ప్రారంభిస్తారు. ఆయనకు బ్యాలెట్‌లో పడిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను ఆయా అభ్యర్థుల వారీగా పంచుతూ వస్తారు. ఇలా ఒక్కో అభ్యర్థిని కింది నుంచి పైకి ఎలిమినేట్ చేస్తూ కౌంటింగ్ కొనసాగిస్తారు. ఈ క్రమంలో ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడితో కౌంటింగ్‌ను నిలిపివేసి విజేతను ప్రకటిస్తారు. అయితే.. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో ఎలిమినేషన్ ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగే అవకాశం ఉంది. కిందటిసారి ఎలిమినేషన్ రౌండ్‌కే 44 గంటల సమయం పట్టింది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ విజేత తేలకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను కూడా లెక్కించనున్నారు. కానీ.. ఇంతవరకు తృతీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరిగిన దాఖలాలు లేవనే చెప్పవచ్చు.

పకడ్బందీగా ఏర్పాట్లు

రెండు రోజుల పాటు జరుగనున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ హాల్ వెలుపుల, లోపల కలిపి మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కిలోమీటర్ పరిధిలో 144సెక్షన్ విధించారు. కేశరాజుపల్లి శివారులోనే పాస్‌లు ఉంటేనే లోపలికి అనుమతించేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే కౌంటింగ్ టేబుళ్లు, వాటికి అనుకుని బ్యాలెట్ పత్రాలను వేసేందుకు అభ్యర్థుల వారీగా ప్రత్యేక ర్యాక్‌లు, ఈ టేబుళ్లకు ఎదురుగా ఇనుప జాలీ ఏర్పాటు చేసి మరోవైపు కౌంటింగ్ ఏజెంట్లు కూర్చునేలా కుర్చీలు వేశారు. అభ్యర్థుల వారీగా బ్యాలెట్ పేపర్లను వేసేందుకు ప్రత్యేకంగా డ్రమ్ములను ఏర్పాటు చేశారు. ఎలిమినేషన్ ప్రక్రియ కూడా ఉండనుండడంతో ప్రతిదీ పక్కా ప్రణాళికతో సిద్ధం చేశారు. కౌంటింగ్‌కు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన ప్రకటించారు. కౌంటింగ్ కేంద్రం ఏరియాలో 144 సెక్షన్ అమలులో ఉన్న కారణంగా పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ గుమికూడవద్దని ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా..

- ఓట్ల లెక్కింపు సిబ్బంది బుధవారం ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో రిపోర్ట్ చేయాలి. కౌంటింగ్ ఏజెంట్లు కూడా రావాలి.
- మొదటి బ్యాచ్ మొదటి షిఫ్ట్ ఉద్యోగులు ఉదయం 6నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విధుల్లో ఉంటారు.
- ఉదయం 8గంటలకు ప్రారంభం కాగానే ముందుగా బ్యాలెట్ పేపర్లను 25 బండిల్స్‌గా కౌంటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్ సూపర్‌వైజర్ చేస్తారు.
- 25కి బండిల్స్ కాకుండా తక్కువగా మిగిలిపోయిన బ్యాలెట్ పేపర్లను తక్కువ ఉన్న బండిల్స్‌గా ఒక స్లిప్‌పై రాసి పెడుతారు.
- 25 చొప్పున చేసిన బండిల్స్‌ను ఒక ట్రంక్ బాక్సులో ఏఆర్ఓ టేబుల్‌పై ఉంచుతారు.
- 25కన్నా తక్కువ ఉన్న బండిల్స్‌ను ప్రత్యేకంగా మరో డ్రమ్ములో వేస్తారు. వీటిని తర్వాత 25 చొప్పున బండిల్స్ చేస్తారు.
- బండిల్ చేసిన అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు రెండో షిఫ్ట్ కౌంటింగ్ స్టాఫ్ విధుల్లోకి వస్తారు.
- మధ్యాహ్నం 3 గంటల నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలు పెడుతారు. అర్ధరాత్రి తర్వాత ఒంటి గంట వరకు ఈ లెక్కింపు పూర్తి కావచ్చని అంచనా.
- రెండో విడుత సిబ్బంది డ్యూటీ అర్ధరాత్రి ఒంటి గంటకు ముగియనుంది.
- ఒక్కో రౌండ్‌లో టేబుల్‌కు వెయ్యి చొప్పున 96వేల ఓట్ల లెక్కింపు జరుగుతుంది.
- ఈ లెక్కన మూడు ఫుల్ రౌండ్స్‌తో పాటు నాలుగో రౌండ్‌లో 62 టేబుళ్లపై లెక్కింపు పూర్తి కానుంది.
- ఇలా తొలి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపునకు 8గంటల సమయం పట్టవచ్చని అంచనా.
- చెల్లని ఓట్లు ప్రత్యేకంగా ఒక ట్రేలో ఉంచుతారు.
- తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక చెల్లిన ఓట్లలోంచి 50శాతం+1ని కలిపి గెలుపు కోటా నిర్ధారిస్తారు.
- గెలుపు కోటాకు అనుగుణంగా ఏ అభ్యర్థి అయినా ఓట్లు సాధిస్తే కౌంటింగ్ ఆపేసి విజేతగా ప్రకటిస్తారు.
- ఒకవేళ ఎవరికీ కోటా ప్రకారం ఓట్లు రాకుంటే ఎలిమినేషన్ ప్రక్రియలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు.
- ఒకవేళ ఇలా ఎలిమినేషన్ రౌండ్ అవసరం పడితే మూడో షిఫ్ట్ సిబ్బంది విధుల్లోకి వస్తారు. వీరు ఇది పూర్తయ్యే వరకు విధుల్లో ఉంటారు.
- 2021లో 90గంటల పాటు సుదీర్ఘ సమయం కౌంటింగ్ జరుగడంతో ఈ సారి అదనపు టేబుళ్లు ఏర్పాటు చేశారు.
- ప్రస్తుతం 36 గంటల్లోపే కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావచ్చని అంచనా.

పాతబస్తీలో ఇంటింటి సర్వే

- ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న వైద్యారోగ్యశాఖ
- వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసిన మున్సిపల్ అధికారులు
- ట్యాంకర్ల ద్వారా వార్డు ప్రజలకు నీటి సరఫరా

నీలగిరి, జూన్ 4 : నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ ప్రాంతంలో వాటర్‌ట్యాంక్‌లో వ్యక్తి మృతదేహం లభించడం, ఆ నీరే ప్రజలకు సరఫరా కావడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఆశాఖ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాములబండ పీహెచ్‌సీ, లైన్‌వాడ యూహెచ్‌సీ సిబ్బంది నాలుగు వార్డుల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయా పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ జమీర్, సూపర్‌వైజర్లు కిరణ్‌కుమార్, పద్మ, 12 మంది ఆశ వర్కర్లు, 8 మంది ఏఎన్ఎంలు నాలుగు బృందాలుగా ఏర్పడి సుమారు వెయ్యి ఇండ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి, జ్వరం వంటి సమస్యలతో ఎవరైనా బాధపడుతున్నారా అనే కోణంలో సర్వే నిర్వహించారు. అక్కడక్కడ కొద్దిమంది సాధారణ జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించిన సిబ్బంది అందుకుగల కారణాలను తెలుసుకునేందుకు రక్త పరీక్షలు చేశారు. వారికి నీటి కాలుష్యంతో కాకుండా సాధారణ జ్వరాలుగానే గుర్తించారు. నాలుగు వార్డుల పరిధిలో ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ధనలక్ష్మి, నాగమణి, భాగ్యలక్ష్మి, పలువురు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లగొండ పాతబస్తీలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

మున్సిపాలిటీ అధికారులు మంగళవారం వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేశారు. ట్యాంక్‌లో క్లోరినేషన్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వారి ఇండ్లల్లో ఉన్న నీటిని ఖాళీ చేయించి ట్యాంకర్ల ద్వారా శుభ్రమైన నీటిని సరఫరా చేశారు. బుధవారం సాయంత్రం లేదా గురువారం ఉదయం నుంచి తిరిగి ట్యాంక్ ద్వారా ఆయా వార్డుల పరిధిలో నీటి సరఫరా పునరుద్ధరిస్తామని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు.

బంగారం దుకాణంలో ఐటీ తనిఖీలు

మిర్యాలగూడ, జూన్ 4 : పట్టణంలోని పెద్ద బజార్‌లో గల శ్రీదేవి ట్రేడర్స్ బంగారం దుకాణంలో మంగళవారం ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గత వారం ఏపీలోని పొట్టి శ్రీరాములు జిల్లా కావలి టోల్‌గేట్ వద్ద ఆర్టీసీ బస్సులో ఐదుగురు మహిళలు తరలిస్తున్న రూ.1.61కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెంకటాచలం టోల్‌గేట్ వద్ద 1.658 కిలోల బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగింది. దీంతో పాటు ప్రకాశం జిల్లా టంగుటూరు వద్ద కారులో దంపతులు తరలిస్తున్న రూ.90లక్షల విలువైన బంగారాన్ని పోలీసులు పట్టుకొని ఐటీ అధికారులకు అప్పగించారు. పెద్ద మొత్తంలో నగదు, బంగారం పట్టుబడగా.. ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మిర్యాలగూడలోని శ్రీదేవి ట్రేడర్స్ దుకాణానికి వచ్చి రికార్డులు పరిశీలించారు.

3గంటలకు పైగా వివరాలను సేకరించిన ఐటీ అధికారులు మీడియాకు ఎలాంటి వివరాలు వెల్లడించకుండానే వెళ్లిపోయారు. ఐటీ దాడుల నేపథ్యంలో మిర్యాలగూడలోని బంగారం దుకాణాల యజమానులు తమ షాపులను మూసివేశారు. ఐటీ తనిఖీలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి.

బంగారు దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఐటీ అధికారులు

వైమానిక దళ ఉద్యోగాల పేరుతో మోసం.. అరెస్టు

కుత్బుల్లాపూర్, జూన్ 4: ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసగించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. జయబేరికాలనీ బాలాజీ రెసిడెన్సీలో కేతావత్ సంతోష్ ఉంటున్నాడు. తనకు ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులతో మంచి పరిచయాలు ఉన్నాయని, ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురితో నమ్మబలికాడు. ఒక్కొక్కరి వద్ద రూ.3 లక్షల నుంచి 6 లక్షల చొప్పున సుమారు రూ. కోటి వరకు వసూలు చేశాడు. ఆపై బోగస్ ఇంటర్వ్యూ చేసి నకిలీ పత్రాలు, స్టాంపులతో పరీక్షలు నిర్వహించి ఆఫర్ లెటర్లను కూడా ఇచ్చాడు. నిజమేనని నమ్మిన యువత ఆఫర్ లెటర్లను ఎయిర్‌ఫోర్స్‌లో చూపించగా.. బోగస్ అని తేలింది. సంతోష్ మోసగించినట్టు తేలడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై నిఘా పెట్టిన పేట్ బషీరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

మహిళకు టోకరా

బంజారాహిల్స్, జూన్ 4: కుటుంబ సభ్యుల అకౌంట్‌లో డబ్బు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఓ మహిళకు టోకరా వేసి.. డబ్బులు కాజేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రమా మండల్ పదేండ్లుగా బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని క్రాస్ విండ్స్ అపార్ట్‌మెంట్స్‌లో కేర్ టేకర్‌గా పనిచేస్తున్నది. ఈ నెల 2న ఆమె సొంతూరులో ఉంటున్న కుమారుడు ఆకాశ్ మండల్ అకౌంట్‌లో డబ్బులు డిపాజిట్ చేసేందుకు బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని ఎస్‌బీఐ బ్యాంకు వద్దకు వెళ్లింది. అక్కడ క్యాష్ డిపాజిట్ మిషిన్ వద్ద డబ్బులు వేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఓ వ్యక్తి ఆమె వద్దకు వచ్చాడు. తనకు అర్జెంట్‌గా క్యాష్ కావాలి.. మీ వద్దనున్న నగదు తనకు ఇస్తే ఫోన్ పే ద్వారా ఆ డబ్బును ఆకాశ్ మండల్‌కు పంపిస్తానంటూ నమ్మబలికాడు. దీంతో రూ.20వేలు అతడికి ఇవ్వగా.. ఫోన్ పే ద్వారా పంపించినట్లు గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ చూపించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత ఆమె కుమారుడికి ఫోన్ చేసి డబ్బుల గురించి తెలుసుకోగా.. తన అకౌంట్‌లోకి డబ్బు రాలేదని చెప్పాడు. రెండు రోజులైనా డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు మంగళవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.